క్లుప్తంగా

త్వరలో పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల

జూపాడుబంగ్లా: నీటిపారుదలశాఖ మంత్రి, ఉన్నతాధికారుల అనుమతి లభించిన వెంటనే పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, పోతిరెడ్డిపాడు ఈఈ మనోహర్‌రాజు మంగళవారం తెలిపారు. శ్రీశైలం జలాశయంలో మంగళవారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో 852.30 అడుగుల నీటిమట్టం నమోదుకాగా 85.2060 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రస్తుతం 42,899క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోందన్నారు. 854 అడుగులకు చేరగానే నీటి విడుదలకు అనుమతులిచ్చే అవకాశం ఉందన్నారు.

పురుగు మందుల విక్రయాల నిలిపివేత

వెలుగోడు: సరైన పత్రాలు లేకుండా నిల్వవున్న పురుగు మందుల అమ్మకాలు నిలిపివేసినట్లు ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. మంగళవారం గుంతకందాల పంచాయతీలోని ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. షాపులో నిల్వ ఉండి సరైన పత్రాలు లేని రూ.3 లక్షలు విలువ కలిగిన 97 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపివేసినట్లు వివరించారు. పురుగు మందులకు, ఎరువు కట్టలకు సరైన పత్రాలు లేకపోవటంపై ఏడీఏ వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలపరిమితి దాటిన పురుగుమందులు షాపులో ఉంచరాదని ఆదేశించారు. అంతకుముందు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులకు ఎరువులు అందజేశారు. ఏడీఏతోపాటు ఏఓ పవన్ కుమార్, సిబ్బంది రామకృష్ణ , వెంకట శివ, అప్సర్ తదితరులు ఉన్నారు.

సకాలంలో విధులకు హాజరవ్వాలి

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పారుమంచాల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించి సకాలంలో సకాలంలో విధులకు హాజరవ్వని ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు సకాలంలో విధులకు హాజరవ్వకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అలాగే ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంటు యూనిట్‌ను పరిశీలించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



డాక్టర్ రాయుడును సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలకల రాబిన్‌సన్ మాదిగ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి బదిలీపై ఆత్మకూరుకు వచ్చి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాయుడును మంగళవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు 24 గంటలు విధులు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దరగయ్య, బుజ్జి మాదిగ, వరద రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో లాభాలు



వడ్డెమానులో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని రైతులు పండ్ల తోటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వడ్డెమాను, కోనేటమ్మపల్లి, బొల్లవరం గ్రామాలలోని కొబ్బరి, చీని, నిమ్మతోటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుతో రైతులు వందశాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. అనంతరం రైతులకు అంతర పంటలు, మొక్కల సంరక్షణ గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో అలివేలు మంగమ్మ, ఈసీ షబానా తదితరులు పాల్గొన్నారు.

వెదుర్ల స్వాధీనం

మహానంది: మహానంది-నంద్యాల రహదారిలోని బుక్కాపురం సమీపంలో వెదుర్లు తరలిస్తున్న బొలేరో వాహనాన్ని అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్ అధ్వర్యంలో వెదుర్లతో తరలివెళ్తున్న వాహనాన్ని మహానంది పర్యావరణ కేంద్రానికి తరలించారు.

జాగ్రత్తలతో పురుగుకు కత్తెర

- మొక్కజొన్న పంటలో ఫాల్ ఆర్మివార్మ్ వ్యాప్తి
- లార్వా దశ దాటుతున్న పురుగు
- నివారణ చర్యలు చేపట్టపోతే నష్టమంటున్న వ్యవసాయాధికారులు



మొక్కజొన్న పంటలో లార్వాదశలో ఉన్న ఫాల్ ఆర్మివార్మ్



మొక్కసుడి భాగాన్ని కత్తిరించి తిన్న కత్తెర పురుగు

జూపాడుబంగ్లా: మొక్కజొన్న పైరులో కత్తెర (ఫాల్ ఆర్మివార్మ్)పురుగు నివారణ పట్ల రైతులు అప్రమత్తం కాకపోతే తీవ్ర పంటనష్టాన్ని చవిచూడాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి హెచ్చరిస్తున్నారు. ప్రారంభ దశలోనే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టాలను నివారించవచ్చని చెబుతున్నారు. అమెరికా దేశానికి చెందిన ఫాల్ ఆర్మివార్మ్ పురుగు నాలుగేళ్ల క్రితం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వ్యాపించినట్లు తెలిపారు.

ఇప్పుడిప్పుడే పురుగు వ్యాప్తి

నందికొట్కూరు నియోజకవర్గంలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 18వేల హెక్టార్లుండగా ప్రస్తుతం 10,500 హెక్టార్లలో సాగు చేశారు. జూపాడుబంగ్లాలో సాధారణ విస్తీర్ణం 5120 హెక్టార్లుకాగా ఇప్పటి వరకు 2,050 హెక్టార్లలో మొక్కజొన్న సాగయ్యింది. ముందస్తు వర్షాలకు సాగు చేసిన పంట 30 రోజుల దశలో ఉంది. కాగా ఇప్పుడిప్పుడే ఫాల్ ఆర్మివార్మ్ పురుగు మొక్కజొన్న పంటను ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కడక్కడ చెట్లు సుడులు ఎండి చచ్చిపోతున్నాయని పేర్కొంటున్నారు. దీనికితోడు ఇటీవల ఎడతెరపిలేకుండా వర్షాలు కురవడంతో నీరు కుట్టు పట్టుకొని మొక్కలు పసుపుపచ్చగా మారుతున్నాయన్నారు.

నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్రనష్టం

కత్తెర పురుగు తలపై వై ఆకారం ఉండటంతో పాటు వెనుకభాగంలో నాలుగు మచ్చలుంటాయి. పంటలపై పురుగు వ్యాపించడానికి ముందే ఎకరా పొలానికి లీటరు వేపమందును పిచికారీ చేసుకోవడంతో పాటు పంటలో అక్కడక్కడ లింగాకర్షణ బుట్టలు, ఎల్లో కార్డులు ఏర్పాటు చేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. ఈ రకం పురుగు ఒక్కపర్యాయం పంటలో వ్యాపిస్తే 900 నుంచి 1500ల దాకా గుడ్లు పెట్టే అవకాశం ఉంది. అతివేగంగా పురుగు పంటలో వ్యాపించడంతోపాటు మొక్కల ఆకులను కత్తిరించినట్లుగా రాత్రికి రాత్రే పూర్తిగా తిని కేవలం ఈనెలను మాత్రమే మిగిలిస్తాయి. ఈ పురుగు నాలుగేళ్ల క్రితం జూపాడుబంగ్లా మండలంలో కనిపించినప్పటికీ రెండేళ్లపాటు కనుమరుగైంది. గతేడాది, ఈ ఏడాది మొక్కజొన్న పంట ప్రారంభంలోనే కత్తెర పురుగు పంటను ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివారణ ఇలా...

మొక్కజొన్న పంట విత్తి 25 రోజుల నుంచి 40 రోజుల మధ్య కాలంలో పంటను ఆశించిన పురుగును వెంటనే నివారించుకునేందుకు ఎమామెక్టిన్ బెంజోయేట్, రైనాక్సిఫైర్, స్పైనోటరాయ్, లీటరు నీటికి 80ఎం.ఎల్ మందును కలుపుకొని పంటపై పిచికారీ చేసుకోవాలి. 40-60రోజుల మధ్యకాలంలో స్పైనోసాడ్, రైనాక్సిఫైర్, స్పైనోటరామ్, థయోమిక్సామ్, లామ్డాసైహోత్రిన్ లీటరు నీటికి 80ఎం.ఎల్ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. బెల్లం తప్పుడులో క్లోరోఫైరిపాస్ మందును కలిపి పంటసుడుల్లో పడేలా చల్లుకోవాల్సి ఉంటుంది.

జాగ్రత్తలతో పురుగును నివారించవచ్చు



మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర (ఫాల్ ఆర్మివార్మ్) పురుగు వ్యాప్తి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండకపోతే రాత్రికి రాత్రే పంటను తినిపారేసేంత శక్తి కత్తెర పురుగుకు ఉంది. ఈ పురుగు పంటను ఆశించటానికి ముందే వేపమందును పంటపై పిచికారీ చేసుకోవటంతోపాటు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. అలాగే క్లోరంట్రానిలిప్రోల్ లీటరు నీటికి 0.5మిల్లీ లీటర్లు, లేదా స్పైనటోరం లీటరు నీటికి 0.5మిల్లీలీటర్ల చొప్పున కలిపి మొక్క సుడి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి.

– కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలి

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రతి అధికారి, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ మేరి మంగళవారం తెలిపారు. గత మూడునెలలలో జరిగిన అభివృద్ధి పనులు, జరగబోయే కార్యక్రమాలు, పలు సంక్షేమ పథకాలు, మండలంలోని సమస్యలపై అందరితో చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సలీంబాషా

మిడుతూరు: గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 12 కేటగిరీలో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి మంజుల రెండో స్థానం, భారతి మూడో స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ సలీంబాషా మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఊర్మిళను, రాణించిన విద్యార్థినులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సూర్యోదయానికి ముందే పింఛన్



బొల్లవరంలో చిన్నవీరమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ అరుణ



ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆసుపత్రిలో ఉన్న రోగికి ఫించన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవీణ్

మహానంది: సూర్యోదయానికి ముందే వలంటీర్లు నిద్రలేచి ప్రతి ఇంటికి వెళ్లి అక్కా, అవ్వా, తాతా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని పింఛన్లు అందించారు. మహానంది మండలంలో మొత్తం 5,154 పింఛన్లు ఉండగా మంగళవారం 3,386 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. దీంతో 65.7శాతం పూర్తయినట్లు చెప్పారు.

ఆసుపత్రికెళ్లి పింఛన్ పంపిణీ

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామానికి చెందిన పేర్ల సరోజిని ప్రకాశం జిల్లా మార్కాపురంలోకి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతోంది. వలంటీర్ కొండేటి ప్రవీణ్ మంగళవారం సొంత ఖర్చులతో మార్కాపురం వెళ్లి ఆసుపత్రిలో ఉన్న సరోజినీ కి పింఛన్ అందజేశాడు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం

- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- జీసీ పాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామంలో మంగళవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి వచ్చిన ఎమ్మెల్యే శిల్పాకు గ్రామ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగిన ఎమ్మెల్యే అవ్వా తాతా మీకు పింఛన్ ఎవరిస్తున్నారు.. అమ్మా, చెల్లీ ఈ పథకాలన్నీ మీకు ఎవరిచ్చారంటూ అడుగుతుంటే ఇంకెవరు నాయనా...మా జగన్ అంటూ ప్రజలు సమాధానమిచ్చారు. మళ్లీ ఈ పథకాలు రావాలంటే ఎవరికి ఓటేస్తారంటే మా ఓట్లు జగన్‌కే అంటూ ప్రజలు సంతోషంగా చెప్పారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం జగనన్న

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల్లోని పచ్చపార్టీ నేతలు చెప్పినవారికే పథకాలు వచ్చేవని, నేడు కేవలం అర్హతే ప్రామాణికంగా కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు నేరుగా ఇంటికే పథకాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, గ్రామ ముఖ్యనేతలు బలరామిరెడ్డి, జయరామ్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏలియా, నాగార్జునరెడ్డి, లింగాపురం నాయకులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఏర్పాట్లపై మంగళవారం శ్రీశైలదేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల వారీగా చేపట్టవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈఓ మాట్లాడుతూ శ్రావణమాసంలోని పర్వదినాల్లో భక్తులరద్దీ దృష్టిలో ఉంచుకుని ఆయా విభాగాల వారు ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పర్వదినాల్లో అభిషేకాల నిలుపుదల

భక్తుల రద్దీ కారణంగా శ్రావణ శనివారాలు, ఆదివారాలు , సోమవారాలు , స్వాతంత్ర్యం దినోత్సవం, శ్రావణ పౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శ్రీకృష్ణాష్టమి, ఆయా పర్వదినాల్లో గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేసినట్లు ఈఓ వెల్లడించారు. అభిషేకాలు నిలుపుదల చేసి నిర్దిష్ట రోజుల్లో రోజుకు నాలుగు విడుతలుగా స్పర్శ దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. లోకకల్యాణం కోసం శ్రావణమాసం మొత్తం అఖండ చతుసప్తాహ శివభజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యార్థం రెండు పర్యాయాలు ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతం జరిపిస్తామన్నారు. శ్రావణ రెండో శుక్రవారం ఈ నెల 25న 750 మందికి , తెల్లరేషన్ కార్డు కలిగిన 250 మంది ముత్తైదువులకు, నాల్గో శుక్రవారం 500 మంది భక్తులకు, మరో 500 మంది చెంచు ముత్తైదువులకు సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే పరోక్ష ఆర్జిత సేవగా వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకునే అవకాశం దేవస్థానం కల్పిస్తుందని, ఇందుకు గాను భక్తులు రూ.1,116 లు సేవా రుసుముగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జూపాడుబంగ్లాలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 12.4 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలంలో అత్యధికంగా 12.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా నందికొట్కూరులో 1.0 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. పాములపాడులో 9.6ఎం.ఎం, కొత్తపల్లిలో 8.4ఎం.ఎం, పగిడ్యాలలో 6.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

'గడప గడపకు' సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే చొరవతో రూ.కోటితో అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. పట్టణంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో వెలుగు చూసిన సమస్యలకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పట్టణంలో కోటి రూపాయల నిధులతో వివిధ అభివద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇటీవల పట్టణంలో ఎమ్మెల్యే గడప గడపకు మనం ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనా అనుమతులు రావడంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, షంషీర్, సుబ్బారెడ్డి, తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

మిడుతూరు: బాల్యం నుంచి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచారక పరిషత్ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని గుడిపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు జయదేవానంద స్వామి చే శ్రీ మాద్రామాయణంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మహాభారతం, గురువారం శ్రీమద్భగవద్గీత శుక్రవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా గో పూజ, కుంకుమార్చన, తదితర విశేష పూజలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న పంటలో నీటిని తొలగించండి

ఆత్మకూరు: డివిజన్‌లో ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కరివేన, నల్లకాల్వ గ్రామంలో మొక్కజొన్న పంటలను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని ఎంత త్వరగా వీలైనంత త్వరగా తొలగించాలన్నారు. వర్షాలు కురిసిన వెంటనే ఎకరాకు 30 హెక్టార్ల యూరియా 20 కిలోల పొటాషియం కలిపి ఎరువుగా పంటకు ఉపయోగించాలన్నారు. ఈ పంటలో కాండం తొలిచే పురుగు ఉధృతి నివారణ కు ఎకరాకు 8 కిలోల కార్బోకిరాన్ గుళికలు ఆకు సుడులలో ఉపయోగించాలని చెప్పారు. కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 100 గ్రాముల బెంజిమన్‌కలిపి నీటిని పిచికారీ చేయాలని సూచించారు. రైతులు ఇతర సమస్యలు ఉంటే మండల వ్యవసాయ కార్యాలయాన్ని పరిశీలించి సలహాలు, సూచనలు తెలుసుకోవాలన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

పగిడ్యాల: తెల్లవారుజామున 5.30 గంటలకు ఉండే కర్నూలు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మంగళవారం నెహ్రూనగర్ గ్రామస్తులు ఆర్టీసు బస్సును నిలిపివేసి ఆందోళన చేపట్టారు. పదిహేను రోజులుగా కర్నూలు బస్సు సర్వీసు రద్దు కావడం వలన వివిధ అవసరాల నిమిత్తం కర్నూలు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి సర్వీసు పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ అధికారులు గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

ఆత్మకూరు: సమానపనికి సమానవేతనం మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 వేల మందికి పైగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఇందులో మున్సిప ల్ కార్మికులు కూడా ఉన్నారన్నారు. అధికారులు స్పందించి సత్వరమే వేతనాలు చెల్లించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు దానమయ్య, వినోద్, రవి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి జార్తలు



గాజులపల్లెలో మౌలాలిస్వామి పీరుకు పూజలు చేస్తున్న భక్తులు

మహానంది: గాజులపల్లెలో మౌలాలిస్వామి జార్తలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు మౌలాలి స్వామి పీరుకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా మౌలాలిస్వామి లక్షలాది భక్తుల మధ్య ఊరేగుతూ మకానానికి చేరుకున్నారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మౌలాలిస్వామికి ఫాతెహాలు, గంధం, కొందరు భక్తులు వెండిగొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మౌలాలిస్వామికి దట్టీలు, పూలసూచికలు, హస్తాలు అలంకరించి మల్లెపూల మాలలు వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఐ రవీంద్ర, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు చేపట్టారు.

కొత్తపల్లి: మండలంలోని శివపురం, నందికుంట గ్రామాలలో మంగళవారం భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి మొహర్రం వేడుకలు గ్రామాల ప్రజలు జరుపుకున్నారు. పీర్ల చావిడిలో స్వామి పీర్లను కొలువుదీరించి పూలమాలలు, నెమలి ఈకలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం సాయంత్రం బాజా భజంత్రీలతో కులమతాలకు అతీతంగా యువత పీర్ల ముందు నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. పురవీధులవెంట మౌలాలి స్వామి పీర్లను ఊరేగింపు నిర్వహించి ఏటికి సాగనంపారు.

భ్రామరికి లక్షకుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. లక్షకుంకుమార్చన పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. పూజలో భాగంగా అర్చకులు,వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు.


అమ్మవారికి ఊయల సేవ

శ్రీభ్రమరాంబాదేవికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఊయలసేవను అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తపూజలతో నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్ల మూర్తులను వేంచేయింపజేసి షోడశోపచారపూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు శాస్త్రోక్తంగా చేశారు. అలాగే స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మరకతలింగేశ్వరుడికి మహారుద్రాభిషేకం



మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్‌లో కొలువైన శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు లక్ష జాజిమల్లె పువ్వులతో అర్చన చేసి అలంకార పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేపట్టారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, రామకృష్ణ, నాగన్న, శ్రీను, అబ్రహం, విజయ్, బాసిక్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: వీఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని ఆత్మకూరు మండలం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశా రు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్‌ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. హక్కుల సాధన కోసం నంద్యాల కలెక్టరేట్ ఎదుట ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఎలు లింగస్వామి, బాలమ్మ, వలి, అంజి, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రాకతో ప్రయాణికుల ఇక్కట్లు



నందికొట్కూరు పట్టణంలోని నీలిషికారిపేట వద్ద నిలిచిన ఆర్టీసీ బస్సులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణానికి టీడీపీ నేత చంద్రబాబునాయుడు రాకతో మంగళవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆయన రావడానికి గంటముందే ఆత్మకూరు, శ్రీశైలం, గుంటూరు, విజయవాడ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులను పోలీసు వారు నీలిషికారిపేట ప్రారంభంలోనే నిలువరించారు. బస్సులు మరోమార్గం ద్వారా వెళ్లే వెసులుబాటు కల్పించకపోవడంతో బస్సుల్లోని ప్రయాణికులు దిగి లగేజీ, పిల్లాపాలతో నడుచుకుంటూ ఆర్టీసి బస్టాండుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో కర్నూలుకు వెళ్లారు.